18

# నేను - నా దేశం

విక్టోరియా మహారాణి మనదేశాన్ని చాలాకాలం ఏలాక, ఆవిడపోతే, ఏడో ఎడ్వర్డు ఏలారుట. పాపం... ఆయన ఎక్కువ కాలం చక్రవర్తిగా ఉండకుండానే పోయారుట. ఆ తర్వాత, ఐదో జార్జిగారు చక్రవర్తి అయ్యారు. లండన్‌లో ఆయన పట్టాభిషేక ఉత్సవాలు అవీ పెద్ద ఎత్తున జరిగాయట. ఇదంతా 1910 సంవత్సరం నాటి మాట.

ఆ తర్వాత కొన్ని రోజులయ్యాక, ఆ చక్రవర్తిగారికి, మన దేశానికి విచ్చేయాలన్న కోరిక కలిగిందిట. రాజుగారు తల్చుకున్నారు. ఇంక కొదువ దేనికీ? జార్జిగారు కోరిక తీర్చదలిచారుట.

ఆ రోజుల్లో మనదేశంలో చిన్న చిన్న రాజ్యాలు, సంస్థానాలు బోల్డుండేవిట. వాళ్ళల్లో కొంతమందిని లండన్‌కే ఉత్సవాలు చూడ్డానికి పిలిచారు. కొంత మందిని ఢిల్లీలో జరిగిన రాజసూయ యాగానికి పిలిచారుట.

లండన్, ఢిల్లీ వెళ్ళలేని వాళ్ళు ఎవరి రాజ్యాల్లో వాళ్ళు వేడుకలు జరుపుకున్నారుట. అయితే ఢిల్లీ రాజసూయ యాగానికి వెళ్ళి ఆయన సార్వభౌమత్వానికి సలాములు చేసినవాళ్ళల్లో మన ఆంధ్రా వాళ్ళు, నిజాంగారు కూడా ఉన్నారుట. ఇవన్నీ కూడా ప్రాచీన నవీన ఢిల్లీ సామ్రాజ్య చరిత్రలో చదివాను.

ఆ తర్వాత, అంటే మనకు స్వాతంత్ర్యం వచ్చాక, ఈ చిన్న చిన్న రాజ్యాలన్నింటి, ఎల్లలూ, సరిహద్దులు, రాజకీయ భౌగోళిక స్వరూపాలు మారిపోతూంటే, ప్రాంతీయ భూభాగాలన్నీ ద్వీపాలుగా చీలిపోతూంటే, పాపం సర్దార్ పటేల్‌గారు, నానాకష్టాలు, తంటాలు, తిప్పలూ పడి, అక్కడా ఇక్కడా సద్ది, రాష్ట్రాలుగా రూపాంతరం చేయడానికి చాలా కృషిచేశారు.

మనమంతా ఒక్కటే... మనమంతా భారతీయులం... అని మన రాజ్యాంగం మనకి చెప్తున్నా, ఎవరి ఊళ్ళు వాళ్ళకి దేశాలు ఎవరి దేశం మీద వాళ్ళకి అభిమానం ఉంటుందన్న సంగతి నాకు పెళ్ళయిన కొత్తలో తెలిసింది.

నా పెళ్ళయిన కొత్తలో బొంబాయిలోని డోంబివిల్లిలో ఉన్నాను. ఓ రోజున పాలవాడు, పాలు పోయడం అయిపోయాక అన్నాడు.

"రేపట్నించి నేనురాను. వేరే ఎవరితోనయినా పోయించుకోండి" అని.

కంగారు పడ్డాను. వెంటనే ఏ ఫ్లాట్ వాళ్ళని అడగాలి? అని.

"అదేం? ఎందుకు రావూ?"

"మా దేస్ వెళ్తున్నాను" వాడి కళ్ళల్లో, మాటల్లో గర్వం. దేస్.. దేస్ ఏంవిటీ? వాడి మొహం చూస్తూంటే ఏదో విదేశీయుడు ఇక్కడ సెటిల్ అయినట్లు లేదు.

బొంబాయిలో మామూలుగా సైకిళ్ళ మీద, సువేగాల మీద వచ్చి పాలుపోసే భయ్యాజీ లాగానే ఉన్నాడు.

అయినా, వీడి 'దేస్' ఏదో కనుక్కుందామన్న కుతూహలం కలిగింది. వెంటనే అడిగేశాను.

"అయితే నీ'దేస్' ఏది? ఏ దేశం వెళ్తున్నావూ?"

"ఉత్తరప్రదేస్. నేను యు.పి. వాడిని. గంగా కినారే వాలా..."

హార్నీ! ఇక్కడివాడివేనా! అయినా నీకు బొంబాయి పరదేశమా! కన్యాకుమారి నుంచి కాశ్మీరం వరకూ విశాలంగా ఉన్న మనదేశంలో తూర్పు వైపున ఉన్న ఈ గంగా కినారా చోరాకి బొంబాయి పరదేశం అయిందన్నమాట.

అయినా వాడి స్వదేశ ప్రేమని చూసి ముచ్చట పడ్డాను. మహా మహా రాం వులారే, జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరియసీ... అని అనుకున్నారు. అలాంటప్పుడు, ఇంక ఈ మానవ మాత్రుడైన భయ్యాజీ ఎంత...!

సరే... పాలవాడంటే అజ్ఞాని. పెద్దగా చదువుకున్నవాడు కాదు. బొత్తిగా చిన్న పల్లెటూరు నుంచి వచ్చిన వాడు. దానిలో అర్థం ఉంది. కానీ, ఆధునిక జీవనం గడుపుతున్న మానవమాత్రులు కూడా అంతేనన్న సంగతి, భిలాయి దగ్గరున్న ఓ సిమెంటు ఫ్యాక్టరీలో ఉండడం మొదలెట్టాకా తెలిసింది.

మా యింటి పక్కనే ఉండే మిసెస్ కొఠారీ "మా దేస్ వెళ్తున్నాం. పాలవాడికి, పేపరు వాడికి చెప్పడం మర్చిపోయాను. కొంచెం రేపు వాళ్ళతో చెప్పండి..."

"అంత హఠాత్తుగా ప్రయాణం కట్టారేం?"

"జోధ్‌పూర్ నుంచి సవాయ్ మాధోపూర్ నుంచి రెండు మంచి సంబంధాలు వచ్చాయిట. మా 'నిష్ఠ'ని తీసుకెళ్తున్నాం. పెళ్ళి కుదిరిందంటే మా 'దేస్'లో చేసి, పార్టీ ఇక్కడ ఇస్తాం..."

మిసెస్ కొఠారీ పెళ్ళయిన వెంటనే ఈ ఫ్యాక్టరీకే వచ్చిందిట. పిల్లలు ఇక్కడ పుట్టారు. వాళ్ళ చదువులు భిలాయ్, రాయపూర్, దుర్గ్‌లోనే పూర్తయ్యాయి. అయినా అన్నం పెట్టిన ఈ ఛత్తీస్‌ఘడ్‌ని తన దేశంగా ఆమె అంగీకరించలేకపోయింది.

ఆ తర్వాత గుజరాత్ వెళ్ళాం. మా ఎదురు ఫ్లాట్‌లో ఉండే ఈలాబేన్ ఓ వారం రోజుల తర్వాత, మా ఇంటికొచ్చింది ఇంగ్లీషు మాట్లాడ్డం నేర్పించమని. ఆమె గుజరాతీలో అడిగింది.

సరే చూద్దాంలే అన్నాను.

మర్నాడు ఓ పొడుగాటి పుస్తకం తీసుకొచ్చింది. క్లాసు మొదలు పెట్టినప్పటికి కానీ నాకు తెలియలేదు. ఆమెకు హిందీ రాదు, నాకు గుజరాతీ రాదు. ఇంక ఎలా? ఒక్క వాక్యం కూడా సాగలేదు.

ఆ తర్వాత ఆదివారం జామ్‌నగర్ వెళ్ళి, వెస్ట్ ఇండియా దుకాణంలో గుజరాతీ–ఇంగ్లీషు ముప్పయి రోజుల్లో నేర్చుకోండి అన్న పుస్తకాన్ని కొన్నాను.

ఆ తర్వాత ఈళాబేన్ నాకు ఓ అరగంట గుజరాతీ, నేను ఆమెకు ఓ అరగంట ఇంగ్లీషు, ఇలా ఇద్దరం ఒకరికొకరం గురువులం అయిపోయాం.

ఓ నెల రోజులు కూడా కాకముందే, ఈళాబేన్ మొగుడు ఈ ఫ్యాక్టరీ వదిలేసి 'కొడినార్' వెళ్ళిపోతున్నారని తెలిసింది.

"అవును, మేం వెళ్ళిపోతున్నాం. అది మా దేస్‌కి చాలా దగ్గర..."

'దేస్' అంటే తెలిసిపోయింది కాబట్టి వెంటనే అడిగాను ఏ దేశం అని. 'వేరావల్' అని గర్వంగా చెప్పింది. అది 'అంబానీ' వాళ్ళ ఊరని అంతే గర్వంగా చెప్పింది.

ఒక్కోసారి నాకనిపించేది నాకు నా దేశం మీద ప్రేమ లేదా! ఇలా ఈ చిన్న చిన్న దేశాలు పట్టుకుని తిరుగుతున్నాం ఏంటి?

మా వారితో పోట్లాడ్డం మొదలెట్టాను. మనం మన దేశం వెళ్ళిపోదాం. పిల్లలకి నాలుగు తెలుగు ముక్కలు రాయడం అయినా వస్తుంది.

ఆ ఫ్యాక్టరీ వదిలేసి, నల్లగొండ జిల్లాలోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్ళాం.

మావారి డిపార్టుమెంటులో పనిచేసే కుట్టి, సెలవుల్లో కేరళ నుంచి ఫ్యామిలీని తీసుకొచ్చాడు. కాలనీ స్కూల్లోనే చదువుతారుట. అందుకని తెలుగు నేర్పించమని నన్ను ప్రాధేయపడ్డాడు.

కుట్టీకి తెలుగు రాదు. హిందీ రాదు. ఇంగ్లీషు, అరవం వచ్చు. నాక్కూడా అరవం వచ్చు కాబట్టి, పిల్లలకి చెప్పడంలో కష్టం ఉండదని అన్నాడు.

చిన్న పిల్లలే కాబట్టి సాయం పట్టేశాను. స్కూళ్ళు తెరిచేనాటికి పదాలు చదివే స్థాయికొచ్చారు.

ఓ రోజున రెండో క్లాసు చదువుతున్న పెద్ద పిల్లకి మనదేశం అనే పాఠంలోని పదాలు, అర్థాలు రాయించి, పాఠం గట్టిగా చదవమన్నాను.

"నా దేశం భారతదేశం. మనమందరమూ భారతీయులం. ఇది ఒక గొప్పదేశము..." అంటూ ఆగింది.

"ఆంటీ... గొప్ప... అంటే ఏంటి? అర్థం రాసుకుంటాను".

తడబడ్డాను. "గొప్ప... అంటే... అన్నింటికన్నా..." ఆగిపోయాను.

"ఇష్టమైన..." సరిగ్గా చెప్పానా అన్నట్లు తల ఊపింది.

ఆ కళ్ళల్లో దేశం యొక్క గొప్పదనం కనుక్కున్నానన్న గర్వం తొణికిసలాడింది.

నిజమే... ఎవరి దేశం వాళ్ళకి ఇష్టమైన గొప్ప దేశం. ఆ తర్వాత భిన్నత్వంలో ఏకత్వం అన్న పదాల్ని - అతి కష్టంమీద కూడబలుక్కుని చదివి, నా మొహంలోకి చూసింది అంటే ఏఁవిటన్నట్లుగా.

"మనదేశంలో, ఇన్ని చిన్న చిన్న దేశాలున్నాయి కదా... అన్ని దేశాలు కలిపి ఓ పెద్ద దేశం అన్నమాట..."

"వాటిని రాష్ట్రాలంటారు కదా, దేశం అంటారా!" అని ఇంగ్లీషులో అడిగింది. "దేశాలు అని అనరు... కదా... ఆంటీ!"

నిజమే. నీలాగా చదువుకునే వయసులో రాష్ట్రం అంటే రాష్ట్రం అని అనుకున్నాను. కానీ, ఎవరి రాష్ట్రం వాళ్ళకి దేశం అన్న సంగతి పెద్దయ్యాకనే తెలిసింది.

ప్రతీ రాష్ట్రం ఓ చిన్న దేశం. మళ్ళా ఆ దేశంలో ఇంకా చిన్న చిన్న దేశాలు కావాలని ఆందోళనలు, ఉద్యమాలు. ఆఖరికి దేవుడి గుడికి భూమి ఇవ్వడానికి కూడా నిరాకరిస్తున్న దేశాలున్నాయి.

స్వాతంత్ర్యం రాకముందు ఎన్ని చిన్న దేశాలున్నాయో, ఎన్ని రాజ్యాలున్నాయో అన్ని దేశాలూ, రాజ్యాలూ వస్తాయని, చరిత్ర పునరావృతం అవుతుందని, మన రాజ్యాంగంలోని ఆర్టికల్స్ సవరించాల్సి వస్తుందని, అప్పుడందరి కన్నా బలవంతుడైన వాడు ఓ రాజసూయ యాగం చేయడానికి అవకాశం ఉందని, ఆ బలవంతుడికి భయపడి సలాం చేసే చిన్న చిన్న రాజ్యాలుంటాయని... ఇలా ఇంకా... ఏదో.. ఏదో చెప్పాలనిపించినా, ఆ పిల్లకది అర్థంకాదని ఊరుకున్నాను.

*పత్రిక మాసపత్రిక, అక్టోబర్ 2008*